www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 25 అక్టోబర్ 2023

5

చిత్తూరు



ఖోఖో విజేత తూర్పుగోదావరి



ప్రజాశక్తి - యదమరి రాష్ట్రస్థాయి 42 వ(13 జిల్లాలు)బాలబాలికల జూనియర్ ఖో ఖో పోటీలు చిత్తూరు జిల్లా ,పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండల కేంద్రం హైస్కూల్ మైదానంలో జరిగాయి. బాలికల మొదటి స్థానం తూర్పు గోదావరి జట్టు కి, రెండవ స్థానం ప్రకాశం జట్టుకి ట్రోఫీ లో గెలుపొందారు. గెలుపొందిన ఇరు జట్లకు పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎం ఎస్ బాబు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బి ఎమ్ అర్ గ్రూప్ సంస్థల అధినేత మోహన్ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ,ఎంపిపి సురేశ్ బాబు, చిత్తూరు సాఫ్ట్ టౌన్ నల్లబోతుల ప్రవీణ్, వైస్ ఎంపీపీ రవి, యాదమరి సర్పంచ్ జాన్సీ పయని , జిల్లా కార్యదర్శి మనోహర్ రెడ్డి, వైస్సార్ కార్యదర్శి , వైఎస్సార్ పార్టీ యూత్ కన్వీనర్ కార్తిక్ జిల్లా ఖో ఖో సంఘ అధ్యక్షులు ప్రవీణ్, కార్యదర్శి శరత్ కుమార్, ప్రజాప్రతినిధులు నిర్వాహక కార్యదర్శి సురేష్ విక్రమ్ పాల్గొన్నారు.



'పతి' కోసం 'సతి'

- నేటినుంచి 'నిజం గెలవాలి' కి శ్రీకారం
- నారావారిపల్లి నుంచే భువనేశ్వరి ప్రారంభం
- తిరుమల 'శ్రీవారి'కి, నాగాలమ్మకూ ప్రత్యేకపూజలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఇన్నాళ్లూ రాజకీయాల్లో ఎక్కడా కనిపించని నారా భువనేశ్వరి అనివార్యంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టనున్నారు. భర్త నారా చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు పెట్టినందుకు నిరసనగా 'నిజం గెలవాలి' అంటూ నేటినుంచి సభల్లో పాల్గొననున్నారు. అలాగే చంద్రబాబును అరెస్టు చేశారని తెలిసి తట్టుకోలేక మృతిచెందిన టిడిపి శ్రేణుల కుటుంబాలను స్వయంగా పరామర్శించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తిరుపతికి విచ్చేసిన నారా భువనేశ్వరి 'నారా' కుటుంబానికి ఉన్న సెంటిమెంట్‌తోనే శ్రీవారి ఆశిస్సులను మంగళవారం తీసుకున్నారు. అలాగే చంద్రబాబు సొంతూరైన నారావారిపల్లిలో అత్తమామ సమాధులకు నివాళి అర్పించారు. కులదైవమైన నాగలామ్మకూ పూజలు చేశారు.

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆయన సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి'కి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంగళవారం నారా భువనేశ్వరి, చంద్రబాబునాయుడు చెల్లెలు కనుమూరి హైమావతితో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 11.15 నిమిషాలకు చంద్రగిరి నియోజకవర్గాం నారావారిపల్లి చేరుకున్న ఆమె కులదైవమైన నాగలామ్మకు పూజలు చేశారు. అనంతరం అత్తమామలైన ఖర్జూరనాయుడు, నారా అమ్మణ్ణమ్మలకు నివాళి అర్పించారు. ఊళ్లో పెద్దల ఆశిస్సులు తీసుకున్నారు. జిల్లా టిడిపి అధినేతలు ఆమెను పరామర్శించారు. చంద్రగిరి మండలం అగరాల వద్ద మంగళవారం సాయంత్రం 3 గంటలకు ఐదువేల మంది మహిళలతో 'నిజం గెలవాలి' సభను నిర్వహించనున్నారు. అంతకుముందు చంద్రగిరి మండలం రంగంపేట, పాకాల మండలం నేంద్రగుంటలో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక



నారావారిపల్లిలో...



అకాల మరణం చెందిన వారి కుటుంబాలను పరామర్శించనున్నారు. అనంతరం నారావారిపల్లికి విచ్చేసి తన తండ్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి మధ్యాహ్నం సభలో పాల్గొంటారు. ఎంఎల్‌సిలు పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పులివర్తినాని, నందమూరి లోకేశ్వరి కుమార్తె చాముండేశ్వరి, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, తెలుగు యువత రాష్ట్ర నాయకులు రవినాయుడు, మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

భువనేశ్వరి సభను విజయవంతం చేద్దాం: డాక్టర్ బాలసుబ్రమణ్యం

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా ఆయన సతీమణి నారా భువనేశ్వరి బుధవారం అంకుర హాస్పిటల్ వద్ద బహిరంగ సభను నిర్వహించనున్నారని, నిజం గెలవాలి పేరుతో నిర్వహించే ఈ సభను విజయవంతం చేద్దామని టిడిపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఈ సభకు సంబంధించిన పోస్టర్లను టిడిపి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలోనే తిరుపతి ఎంతో అభివద్ధి చెందిందన్నారు. ప్రజలకు చంద్రబాబు సేవలు ఎంతో అవసరమని ఆనాడు అలిపిరి బాంబు బ్లాస్ట్ ఘటనలో తిరుమల శ్రీవారు ఆయన ప్రాణాలను రక్షించారని అన్నారు. చంద్రబాబు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాక్షస ఆనందాన్ని పొందుతున్న నేపథ్యంలో నారా భువనేశ్వరి తన ఆవేదనను ప్రజలకు వివరిస్తూ బస్సు యాత్ర చేస్తారన్నారు. ఎవరు ఎన్ని చేసినా అంతిమ విజయం న్యాయందేనని, చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి నాయకురాలు అంబూరు సింధుజ, టిడిపి శాలివాహన సాధికార సమితి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు ఆముదాల తులసీదాస్, తెలుగు యువత నాయకులు పెరుమాళ్ మధు, హిమత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో నారా భువనేశ్వరి

చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. భువనేశ్వరితో పాటు టీడీపీ ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు. దర్శనం అనంతరం అర్చకులు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె నారావారిపల్లెకు బయలుదేరారు. బుధవారం నుంచి నారా భువనేశ్వరి బస్సు యాత్ర నారావారిపల్లె నుంచి ప్రారంభం కానుంది. గెలవాలి అనే పేరిట ఆమె ఈ యాత్రను చేపట్టనున్నారు.



నారా భువనేశ్వరిని కలిసిన జనసేన జిల్లా నాయకులు పసుపులేటి హరిప్రసాద్



నిధులు లేక నీరసం
వికసించని 'బాలికా వికాసం'

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

బాలికా వికాసం కోసం పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యం స్త్రీ, పురుషుల సమానత్వం, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, పరిసరాల పరిశుభ్రత, గృహహింస, పిల్లలపై వివక్షత అనే విషయాలపై పాఠశాలలు, కళాశాలలు, పాలిటెక్నికల్, ఐటిఐలో చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించేలా వైఎస్ఆర్ కిశోర వికాసం పేరుతో జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.తొలుత 2017-18లో జిల్లా కేంద్రమైన చిత్తూరులోని కాణిపాకం రోడ్డు సంతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సిఎం నారాయణ స్వామి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి విడతలో పాఠశాల విద్యార్థులకు పరిమితం చేశారు. రెండో విడతతో కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటిఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 80వేల మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు.

విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పీజి, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంపిక చేసిన చురుకైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అయితే ప్రస్తుతం వైఎస్ఆర్ బాలికా వికాసం కార్యక్రమం నిధులు లేక నీరశించి పోయింది. కరోనా కారణంగా ఆగిపోయినట్లు అధికారులు చెబుతున్నా... ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా జిల్లాలో ఎక్కడా వైఎస్ఆర్ కిశోర బాలికా వికాసం పేరుతో కౌమార బాలికలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు జరగకపోవడం గమనార్హం. కౌమారదశలో ఉన్న పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో సమాజంపట్ల అవగాహన, విషయ పరిజ్ఞానం, ఇతరులపై ఆధార పడకుండా స్వయం ఉపాధి, మహిళాచట్టాలపై అవగాహన వంటి విషయాలను తెలుసుకొనే అవకాశం ఉంటుంది. ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంచుకొనేందుకు దోహదపడుతుంది. ఇతరులతో మాట్లాడేందుకు సహజంగా ఉండే బెరుకు, భయం పోయి స్వేచ్ఛగా మాట్లాడే తత్వం పెంపొందుతుంది.

తిరిగి పారంభిస్తాం : నాగశైలజ, ఇన్‌ఛార్జి పీడీ స్త్రీ శిశు సంక్షేమ శాఖ

పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సమాజం పట్ల అవగాహన కల్పిండంతో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే వైఎస్ఆర్ కిషోర బాలిక వికాసం మూడో దశ 2019-20 నుండీ నిధుల లేక అగిపోయింది. కరోనా ప్రభావం ఒక కారణమైతే ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం మరో కారణం. ప్రభుత్వం నిధులు మంజురు చేసి కొనసాగించమంటే తిరిగి ఈ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాం.



విజేతలతో మంత్రి ఆర్‌కె రోజా

పిల్లల్లో జోష్ నింపిన ఆర్కేరోజా

ప్రజాశక్తి - నగరి

పట్టణ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 8వ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన ఫైర్ క్యాంప్ కార్యక్రమంతో మైదానం అంతా ఆనందపు కేరింతలు వినిపించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా క్రీడాకారులతో మమేకమై తన విద్యార్థిదశను గుర్తుచేసుకున్నారు. తాను మీతోటి క్రీడాకారిణే అంటూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ మంటల చుట్టూ తిరుగుతూ ఆనందంగా నత్యం చేయడం ఈ కార్యక్రమానికి నూతన హంగులను చేకూర్చింది. మంత్రితో కలిసి నత్యం చేసిన విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. వాళ్లలో కొత్త జోష్ కనిపించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరుసగా క్రీడల్లో పాల్గొని అలసిపోయిన విద్యార్థుల్లో కొత్త జోష్ నింపడానికే టోర్నమెంట్లలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఇది విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. అప్పటివరకు జరిగిన పోటీల్లో గెలుపు, ఓటమి ఆనే తేడాలు మరచి అందరం మంచి స్నేహితులమనే స్నేహ భావాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమానంతరం పోటీలను చక్కగా నిర్వహించిన రాష్ట్ర, జిల్లా, నగరి బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులను ఆమె దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫైర్ క్యాంప్
విద్యార్థులతో కలసి నృత్యం
కేరింతలతో క్రీడా మైదానం



మైదానంలో విద్యార్థులతో కలిసి రోజా సందడి

చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను వేమన విజ్ఞాన కేంద్రం ఆఫీస్ లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, జెవివి బిర్లా నాయుడు ,రఫీ, శివ, అక్బర్, అశోక్ లు గోడపత్రికను ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ వారి సహకారంతో జన విజ్ఞాన వేదిక ఈ సంబరాలను నిర్వహిస్తున్నదని తెలియజేశారు. ఈ సైన్స్ సంబరాల్లో అన్ని ప్రభుత్వ ,ప్రైవేటు ఉన్నత పాఠశాలలలో 8,9,10 వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. పాఠశాల స్థాయి పరీక్ష నవంబర్ 10న, మండల స్థాయిలో నవంబర్ 30న, జిల్లా స్థాయిలో డిసెంబర్ 17న రాష్ట్రస్థాయి జనవరి 27,28 తేదీలలో జరుగుతుందని తెలియజేశారు. సైన్స్ ప్రయోగాలు , వేమన పద్యాలు, మ్యాజిక్ లాంటీ రకరకాల కార్యక్రమాలు ఉంటాయి. వీటిలో విజేతలు గా ప్రభుత్వ పాఠశాలల నుంచి ఒక టీం, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఒక టీం ప్రకటిస్తారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నేతలు

భూమి దక్కలేదని రైతు ఆత్మహత్యాయత్నం



ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి

భూతగాదాల కారణంగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారిన ఓ రైతు చివరికి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బైరెడ్డిపల్లి మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బైరెడ్డిపల్లి మండలం మిట్టకురపల్లి గ్రామానికి చెందిన చంద్రప్ప (32) సోమవారం తన భూమిని కబ్జా చేసిన పలమనేరు సాయి గార్డెన్స్‌లో నివసిస్తున్న ఎ.కృష్ణమూర్తి ఇంటికి వెళ్లి తన భూమి తనకు దక్కేలా చేయాలని ప్రాధేయపడ్డాడు. అయితే మధ్యవర్తి ఎ.నాగరాజ్ చరవాణి ద్వారా రెచ్చగొట్టడంతో రైతు చంద్రప్ప తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వెంటనే పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అతనికి భార్య మంజుల, కుమార్తె ధనుశ్రీ, కుమారుడు కుబేర్ ఉన్నారు. చంద్రప్ప కొన్నిరోజుల క్రితం తన కుటుంబ ఖర్చులకు మిట్టకురపల్లి గ్రామానికి చెందిన ఎ.కృష్ణమూర్తి వద్ద తన భూమిని తాకట్టు పెట్టి కొంత డబ్బు తీసుకున్నాడు. బైరెడ్డిపల్లిలో హైవే రోడ్డు కారణంగా భూముల విలువ పెరగడంతో డబ్బులు తిరిగి చెల్లిస్తున్నా ఎ.కృష్ణమూర్తి తన భార్య కాంతమ్మ పేరుపై పాస్‌బుక్ చేసుకున్నాడు. ఈ విషయమై కొన్నిరోజులుగా రెవెన్యూ అధికారులకు చంద్రప్ప మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని భార్య మంజుల వాపోయింది. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని మొరపెట్టుకుంది.

మోకాళ్లపై టిడిపి శ్రేణుల నిరసన

ప్రజాశక్తి -యదమరి

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును జైలు నుండి బేషరతుగా విడుదల చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మాదిరెడ్డిపల్లి గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు మొరార్జీ యాదవ్, ఎంపిటిసి కుప్పయ్య, టిడిపి నేత విజయేంద్ర యాదవ్ అధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి జైలులో పెట్టారని విమర్శించారు. 45 రోజులు గడుస్తున్నా కోర్టులో కేసులకు సంబంధించి ఆధారాలను సమర్పించడంలో ప్రభుత్వ అధికారులు విఫలమయ్యారని దుయ్యబట్టారు. చంద్రబాబును, టిడిపి నేతలను ఇబ్బంది పెడుతున్న వాళ్ళను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి హేమగిరి, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, తెలుగు యువత అధ్యక్షుడు గుణశేఖర్ రాయల్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మునిర్, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిత్ర, బీసీ సెల్ అధ్యక్షుడు గోపి గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివాజీ, ప్రధాన కార్యదర్శి కమలనాధన్ పాల్గొన్నారు.

బంగారు... 'తగ్గేదేలే'..!

10 గ్రాముల బంగారం రూ.61,750
కేజీ వెండి ధర రూ.78,700
దీపావళి వరకూ ఇంతేనా...!!

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

దీపావళి అంటేనే వెలుగుల పండుగ.. బాణసంచా పేల్చి పిల్లలు కేరింతలు కొడుతుంటే, మహిళలు బంగారం కొని ఆనందపడుతుంటారు.. సహజంగా దసరా నుంచి దీపావళి వరకూ మహిళలు ఎంతోకొంత బంగారం కొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే ఈసారి దీపావళికి బంగారం ధర తగ్గేదేలే అనేలా ఆకాశం వైపే చూస్తోంది. పది గ్రాముల బంగారు ధర రూ.61,750 ఉంది. కేజీ వెండి ధర రూ.78,700గా ఉంది. ఏమైనా దీపావళి వరకూ ఇదే ధరలు ఉంటాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు బంగారు షాపుల్లో అక్రమ నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో రాయలసీమ పరిధిలో ఐటి దాడులూ జరుగుతుండటం గమనార్హం.

దసరా రోజు ఏ కార్యం చేపట్టినా విజయోస్తు అనేలా ఉంటుందని భక్తుల నమ్మకం. అందుకే కొత్త పనులు ఏవైనా దసరా రోజు ప్రారంభిస్తారు. అలాగే మహిళలు సైతం బంగారం కొనుక్కునేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అయితే దసరా పండుగకు బంగారం కొనేందుకు వెళ్లిన మహిళలు ధరలు చూసి వెనకడుగు వేశారు. పశ్చిమాసియా దేశాల్లోని ఇజ్రాయిల్ - పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా బంగారం ధరలు కొంత పెరిగినట్లు బంగారు నగల వ్యాపారులు చెబుతున్నారు. మరికొన్ని రోజులు ఇలాగే ఉంటాయని తెలుస్తోంది. దీపావళి పండుగకు బంగారు, వెండి కొనాలని ఆశపడితే పెరిగిన ధరలతో కొనుగోలు చేయాల్సిందే. మంగళవారం నాటికి కేజీ వెండి ధర 78,700 ధర పలుకుతోంది. 24 క్యారెట్ల బంగారు గ్రాముపై 220 రూపాయలు ధర పెరిగింది. పెరిగిన ధరతో 10 గ్రాముల బంగారం రూ.61,750గా ఉంది. 22 క్యారెట్ల బంగారం గ్రాముపై 200 పెరగడంతో పది గ్రాములు 56వేలకు చేరుకుంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు పెట్టుకున్న వారు ప్రస్తుతం బంగారు కావాల్సినంత కొనే పరిస్థితి లేదు. ఏదో అవసరం మేరకు కొని సులభ వాయిదాలు చెల్లించుకోవాల్సిందేనని మహిళలు అంటున్నారు. మొత్తానికి బంగారు, వెండి ధరలు రెండూ పోటీపడి పరుగులు తీస్తున్నాయి. ఈ రెండే కాకుండా ప్లాటినం, వజ్రాలు, ఇతర అలంకరణ వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. కార్తీక మాసంలో పెళ్లిళ్ల సీజన్ ఉండడంతో బంగారు నగలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తారని వ్యాపారులు అంటున్నారు. రాయలసీమ జిల్లాల పరిధిలో బంగారు నగల క్రయ విక్రయాలు ఈ నెలలో కొంతవరకూ తగ్గినా వచ్చే నెలలో పుంజుకునే అవకాశాలు ఉన్నాయి.

వ్యాపారులపై నిఘా

బంగారు నగలు అమ్మే వ్యాపారులపై ఐటి అధికార్లు నిఘా పెట్టారు. ఇటీవల ఐటీ అధికార్లు రాయలసీమ జిల్లాలతో పాటు కడప జిల్లా ప్రొద్దుటూరులో దాడులు చేసి సుమారు 200కేజిల బంగారును సీజ్ చేశారు. వీరు ప్రభుత్వనికి ఎటువంటి ట్యాక్స్ చెల్లించకుండ అమ్మకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో ఐటి



దాడులు రాయలసీమ జిల్లాల్లో చేస్తున్నారు. తిరుపతి జిల్లాలోనూ ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించకుండా వ్యాపారులు అమ్మకాలు ఏమైనా చేస్తున్నారా? లేదా ? అని ఐటి అధికారులు నిఘా పెట్టారు. బంగారు నగల వ్యాపారులు ఐటి దాడుల సమాచారం తెలుసుకుని అప్రమత్తంగా ఉన్నారు.

నేడు వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం


శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుడుపల్లి: మండల కేంద్రంలో వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళన నిర్వహించనున్నట్లు టిడిపి మండల వన్నియాకుల క్షత్రియ అధ్యక్షులు శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10గంటలకు ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి వన్నియాకుల క్షత్రియ కుటుంబ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అణచివేత ధోరణితో ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఆ మేరకు వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న దాడులు ఎదుర్కొనేందుకు వివిధ విధాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని బండ్లపల్లి పంచాయతీ సగినేకుప్పంకు చెందిన వైసిపి నేత నారాయణస్వామి తండ్రి పెద్దమని వెంకటప్ప సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ వారి కుటుంబానికి సంతాపం తెలియజేశారు. ఆయన ఆదేశాలతో రామకుప్పం ఎంపిపి సుబ్రమణ్యం చేతుల మీదుగా మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు కేశవరెడ్డి, మంజునాథ్, రవిచంద్రారెడ్డి, వెంకట్రాంరెడ్డి, శంకర్, ప్రసాద్, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి కానుక

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి దాతలు రథాన్ని కానుకగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన దాత వెంకటేష్ కుటుంబీకులు సోమవారం ఆలయానికి రథం అందజేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం స్వామి, అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, కళ్యాణోత్సవం, ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం ఆలయ పురవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


సాంస్కృతిక మేళాలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక మేళాలో బైరెడ్డి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దసరా సందర్భంగా సోమవారం కడప శిల్పా రామలో సాంస్కృతిక మేళాలో నిర్వహించగా బైరెడ్డిపల్లె కళా తరంగిణి సంస్థ విద్యార్థులు పాల్గొన్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు, ప్రదర్శించి కళాప్రతిభతో ప్రశంసలందుకున్నారు. విద్యార్థులు హర్షిత, జనని, ప్రవల్లిక, పణిని, రాజు, పవిత్ర, కరుణశ్రీ, సువర్ణ, భవ్యశ్రీ, ఉష, మానస, ప్రసీకా, చరణ్‌కుమార్, సూర్య ప్రకాష్ ఉన్నారు. విద్యార్థులకు శిల్పారామం శిల్పారామం రాష్ట్ర కోఆర్డినేటర్ మునిరాజు, ఏవో శివప్రసాద్, ఆర్గనైజర్ పద్మాకరరావు అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాతరంగిణి వ్యవస్థాపకులు రాజేష్ బాబు, మస్తాన్ వలి, జయచంద్ర, శివాజీ పాల్గొన్నారు.

పోటీల ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయస్థాయిలో నిర్వహించిన భాషా పోటీల ఫలితాలను మంగళవారం ఆ సంస్థ వ్యవస్థాపకులు పి.తులసినాథంనాయుడు విడుదల చేశారు. వ్యాసరచన పోటీలో హైదరాబాదుకు చెందిన సాయిజైరెడ్డి, వెంకటమహేష్, సుశాంత్, అక్షిత్, చిత్తూరుకు చెందిన ప్రతిభ, పలమనేరుకు చెందిన చందు, నాగభూషణ్, విశాల్, సాయిలావణ్య, ఉమర్, ప్రజ్ఞయ్, రోహిత, తేజశ్రీ, సిరిశ్రీ, గ్రీష్మ, సాయిశ్రీ, గణేష్, శరణ్యలు ఎంపికయ్యారు. చిత్రలేఖన పోటీలో హైదరాబాదుకు చెందిన అర్పితా, చౌడేపల్లికి చెందిన వైష్ణవి, సోమలకు చెందిన సాయిధ్యాన్ చంద్, చిత్తూరుకు చెందిన గుణసాహిత్య, రొంపిచర్లకు చెందిన సాయిజైర్, సాకేతుకు చెందిన లక్కీ, ప్రణీత, పలమనేరుకు చెందిన లక్కీ చేతన, ప్రకాష్ రాజ్, గిర్వాస్, తేజలు ఎంపికయ్యారు. పద్యాల పోటీలో సోమలకు చెందిన జైవర్ధన్, సాయి ధ్యాన్చంద్, పలమనేరుకు చెందిన కతివెంకట్, కాంతివెంకట్, కీలపట్లకు చెందిన దింపుల్, దుర్గా, లక్ష్మీశ్రీ, పావని, మేఘశ్రీ, శ్రీజ, దుర్గశ్రీ, రిషిత, మమతశ్రీ, మధుశ్రీ, గౌతమ్‌లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విజేతలకి ఈనెల 29వ తేదీ జరిగే సంస్థ వార్షికోత్సవంలో బహుమతులను తులసీనాథం అందిస్తారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-వి.కోట: మండలంలోని బోడిగుట్టపల్లి పంచాయతీ దొడ్డిపల్లిలో మంగళవారం జెడ్పి ఛైర్మన్ శ్రీనివాసులు సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు మౌళిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు జెడ్పి ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి యువరాజ్, ఎంపిటిసి మంజునాథ్, నాయకులు మణి, హరి, రాము తదితరులు పాల్గొన్నారు.

80రోజుల తరువాత జనాల్లోకి చల్లా


క్యాడర్‌తో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రొంపిచర్ల: పుంగనూరు అల్లర్ల ఘటనలో అరెస్టు అయి విడుదలైన పుంగనూరు టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి 80రోజుల తరువాత ప్రజలలో మమేకమయ్యారు. కాగా ఆగస్టు 4న పోలీసులు చల్లాబాబుతో పాటు పలువురిని జైలుకు పంపారు. 34రోజుల తరువాత విడుదలయ్యారు. మంగళవారం రొంపిచర్ల క్యాడర్ కలసి పలు అంశాలను చర్చించారు.

వైసిపి పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రొంపిచర్ల: మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించబోయే వై నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ ఇబ్రహీం ఖాన్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం బండకిందపల్లి, రొంపిచర్ల, బొమ్మయ్యగారిపల్లి పంచాయతీలలో పర్యటిస్తామన్నారు. గురువారం గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, చిన్నగొట్టిగల్లులలో పర్యటిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీజనల్ వ్యాధుల పట్ల అపోహలు వద్దు

డాక్టర్ రవిరాజు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధుల పట్ల అపోహలు వీడాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాజులకండ్రిగ దళితవాడను సందర్శించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వాతావరణం మార్పు వల్ల వస్తుంటాయన్నారు. అలాంటి జ్వరాలపై అపోహలు చెందకూడదని అవసరం లేదన్నారు. జ్వరం వచ్చినప్పుడు కీళ్ళ వాపు, కాళ్ళు చేతులు వాపు రావడం జరుగుతుందని, ఇటువంటి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి జేబులు చిల్లులు చేసుకోకుండన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతోనే కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకోవాలన్నారు. అలాగే ఇళ్ళ వద్ద నీరు నిల్వలు లేకుండా, పాత వస్తువుల్లో నీరు నిల్వలు లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు


అమ్మవారికి సారె తీసుకొస్తున్న జెడ్పి ఛైర్మన్

ప్రజాశక్తి -కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంగారమ్మ ఆలయంలో అమ్మవారికి విశేషంగా అభిషేకాలు, అలంకరణ జరిగింది. మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా బాటగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళవారం దసరా ముగింపు వేడుకల సందర్భంగా అన్నదానం గ్రామస్తులు అన్నదానం చేపట్టారు.

బంగారుపాళ్యం: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మొగిలిలో ప్రత్యేక పూజలు జరిగాయి.

వికోట: స్థానిక దుర్గామాత ఆలయంలో చిత్తూరు జెడ్పి ఛైర్మన్ శ్రీనివాసులు మంగళవారం ప్రత్యేకంగా పూజలు చేశారు. అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసినసాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం, మాజీ ధర్మకర్త దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుధపూజ


ఎస్పీ కార్యాలయంలో ఆయుధపూజా కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి దశరా శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పాత ఎస్పీ కార్యాలయంలో పోలీస్ వాహనాలక ఆయుద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెడు పై మంచి విజయానికి నాందిగా విజయదశమి పర్వదినం నిర్వహించుకుంటారని, సాయుధ పోలీస్ కార్యాలయం యందు ఇంత ఘనంగా ఏర్పాట్లు చేసి పూజ కార్యక్రమలను నిర్వహించిన సాయుధ దళ అధికారులను, సిబ్బందిని అభినందిస్తూ అందరికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసినారు. అదే విధంగా జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతో ఈ పర్వదినాన్ని జరుపుకోవాలని ఆశిస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ అడ్మిన్ ఎస్పీ సుధాకర్, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, డిఎస్పీ శ్రీనివాసరెడ్డి,బాబు ప్రసాద్, విష్ణురఘువీర్, డిటిసి శ్రావణ్‌కుమార్, ఏఆర్ డిఎసపి మురళీధర్‌లతో పాటు సిఐలు, ఎస్‌లు పాల్గొన్నారు.

నిజం గెలవాలి యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తెలుగు మహిళా నాయకురాలు అరుణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నిజం గెలవాలి అంటూ నారా భువనేశ్వరి చేపడుతున్న సభలను విజయంతం చేయాలని తెలుగు మహిళా జిల్లా నాయకులు అరుణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 45 రోజులుగా నారా చంద్రబాబునాయుడు జైల్లో ఉన్నారని అక్రమ అరెస్టులను నిరశిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తారనే అక్కసుతోనే అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారన్నారు. నిజం గెలవాలంటూ నారా భువనేశ్వరి జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో తెలుగు మహిళా నాయకులు మాజీ ఎంపీపీ శాంతమ్మ గంగాధర్ నెల్లూరు మండలం మహిళా అధ్యక్షురాలు లోకమ్మ సెక్రటరీ భువనేశ్వరి గంగాధర్ నియోజకవర్గ తెలుగు మహిళలు గీతమ్మ, గాయత్రి యాదవ్ పాల్గొన్నారు.

కొరియా ఏపీసిఐసిటి డిజిటల్ లీడర్స్‌కార్యక్రమంలో పాల్గొనండి..

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజిని కి దక్షిణ కొరియాలో నిర్వహించే డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించే వార్షిక ఏపీసిఐసిటి డిజిటల్ లీడర్స్ కార్యక్రమానికి హాజరు కావాలి ఆహ్వానం అందినట్లు పిఆర్వో డాక్టర్ రజిని ఓ ప్రకటనలో తెలిపారు. ఆమెతో పాటు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ఆచార్య పి విజయలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్ పర్సన్ ఆచార్య పి ఉమామహేశ్వరిలకూ ఆహ్వానం అందినట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వారు పాల్గొంటున్నట్లు తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా, ఈ ఈవెంట్‌ను ఇంచియాన్ మెట్రోపాలిటన్ సిటీ, ఎపిసిఐసిటి (సమాచారం, కమ్యూనికేషన్ టెక్నాలజీ , కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆసియా, పసిఫిక్ శిక్షణా కేంద్రం) సహ-ఆర్గనైజ్ చేస్తున్నారు. గవర్నమెంట్ ప్రతినిధిగా ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ గవర్నమెంట్ ప్రతినిధిగా హాజరుకానున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని సబ్జెక్ట్ ఎక్స్‌పెర్టుగా పాల్గొననున్నారు. ప్రొఫెసర్ పి విజయలక్ష్మి యు ఎన్ ఏపీ సి ఐ టిసి వైఫై కన్సల్టెంట్ హోదాలో హాజరు కానున్నారు. డిజిటల్ లీడర్స్ ప్రోగ్రామ్ ప్రధాన లక్ష్యం డిజిటల్ లీడర్స్, ఛాంపియన్‌ల నెట్‌వర్క్ బలో పేతం , డిజిటల్ ట్రాన్స్‌ఫర్మే షన్, ఇన్నో వేషన్ ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలకు సాధికారత కల్పించే పనికి మద్దతు ఇస్తుంది. ఈ కార్యక్రమం పాల్గొనేవారికి కేంద్రం వైఫై (ఉమెన్ ఐసిటి ఫ్రాంటియర్ ఇనిషియేటివ్) ప్రోగ్రామ్ ఉన్నత-స్థాయి అవలోకనాన్ని అందిస్తుంది. మహిళా పారిశ్రామి కవేత్తల డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడేందుకు కీలకమైన కీలక సమస్యలను హైలైట్ చేయడం, డిజిటల్ సాధికార తపై దృక్కోణా లు, మంచి అభ్యాసాలను పంచుకో వడానికి, అభివృద్ధి చెందు తున్న సామర్థ్యాన్ని పెంపొం దించే అవసరాలను గుర్తించ డానికి ఒక వేదికను అందిస్తుంది. కొత్త వైఫై శిక్షణ మాడ్యూల్స్ కూడా సమావేశం లో ప్రతిపాదన, సమీక్ష కార్యక్రమాలు వుం టా యని వారు పేర్కొన్నారు.

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం


బంగారుపాళ్యంలో కాగితాలను తగలను తగలబెడుతున్న నాయకులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: టిడిపి పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి జిల్లా కార్యనిర్వహణ కార్య దర్శి కృష్ణమనాయుడు అన్నారు. మంగళవారం బుక్కాయపట్నంలో టిడిపి నాయకులతో కలసి బాబుతో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, జ్యోతియాదవ్ అన్నారు. కార్యక్రమంలో చిట్టిరెడ్డి, లోకేష్ నాయుడు, ప్రకాష్, గోపి, వినాయకం పాల్గొన్నారు.

వెదురుకుప్పం: నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవారి కార్యక్రమం విజయవంతం కావాలని స్థానిక ధర్మరాజుల ఆలయంలో టిడిపి నేతలు పూజలు చేపట్టారు. జనసేనపార్టీ ఇంచార్జ్ పొన్నా యుగంధర్, టిడిపి నాయకులు సతీష్, రాఘవ, శోభన్ బాబు, విజయ్, నరేష్ ఉన్నారు.

బంగారుపాళ్యం: టిడిపి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కోక ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జగనాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్ల రాసిన కాగితాలను తగలబెట్టారు.

రైల్వే బ్రిడ్జి లోపల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి


ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నుండి తిరుపతికి వెళ్లే మార్గం లో ఉన్నటువంటి చిత్తూరు రైల్వే అండర్ బ్రిడ్జి క్రింద పోవడానికి, రావడానికి వెళుతున్న ప్రయాణికులకు, ముఖ్యంగా నడిచి వెళ్తున్న పాదచారులకు రాత్రుల యందు కారు చీకటిగా ఉన్నందువలన నడిచి వెళ్ళడానికి ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు. ప్రత్యేకంగా మహిళలు భయపడుతున్నారు. పక్కన ఉన్నటువంటి పొదలలో పాములు వచ్చే ప్రమాదముంది. చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ జోక్యం చేసుకొని ప్రజల సౌకర్యార్థం కోసం రైల్వే అండర్ బ్రిడ్జి కి ఇరువైపులా లైట్లు అమర్చడానికి చర్యలు చేపట్టాలని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

బాల త్రిపుర సుందరి ఆలంయంలో మహా చండీయాగం


డిఎ శ్రీనివాస్‌తో జిజేఎం ట్రస్ట్ ఛైర్మెన్ గురజాల జగన్‌మోహన్‌నాయుడు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అక్రమ అరెస్టుతో జైల్లో ఉన్న చంద్రబాబు నాయుడు నిర్దోషిగా బయటకు రావాలంటూ జిజెఎం ట్రస్ట్ ఛైర్మెన్ గురజాల జగన్‌మోహన్ నాయుడు బివిరెడ్డి కాలనీలోని తన నివాసంలో నిర్వహించిన తొమ్మిది రోజుల చండీయోగం మంగళవారం వరకు నిరతరంగా సాగింది. స్థానిక ఇరువారం వద్ద గల బాల త్రిపుర సుందరి అమ్మవారి దేవాలయంలో సోమవారం స్వర్గీయ డీకే ఆదికేశవులు, సత్యాప్రభ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన మహాచండీయాగ హెూమ కార్యక్రమానికి హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జి.జె.యం చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మెన్ గురజాల జగన్ మోహన్, శ్రీనివాస్, తేజస్విని విజయదశమి శుభాకాంక్షలు తెలిపి అమ్మవారి ఆశీస్సులు చిత్తూరు నియోజకవర్గ ప్రజలపై మెండుగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్పోరేటర్లు,సీనీయర్ నాయకులు ధనంజయ నాయిడు,యువ నాయకులు హేమాద్రి నాయుడు వినయ్, చక్రి, రాజేష్, జగన్, చరణ్, కిరణ్, పవన్ పాల్గొన్నారు.

టిడిపి అధినేత క్షేమంగా ఉండాలి



ప్రజాశక్తి-కుప్పం: శ్రీనివాసుడి కరుణతో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పూర్తి ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని ఆయన సతీమణి నారా భువనేశ్వరి తిరుమలేశుని ప్రార్థించినట్లు తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. అక్రమ కేసులో అరెస్టై జైలు పాలైన చంద్రబాబును అధికార ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ఆయన ఆరోపించారు. జైలులో బాబుకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, ఆయన ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం లేదని తెలియజేస్తూ అందుకు నిదర్శనంగా ఇటీవల రాజమండ్రి పట్టణంలో ఆసుపత్రికి ఆయనను తరలించిన ఘటనను గుర్తు చేశారు. ఆయన క్షేమం కోరి మంగళవారం నాడు నారా భువనేశ్వరి తిరుమల శ్రీవారిని దర్శించుకుని ప్రార్థించడం జరిగిందన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: సిఐటియు

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు మండలంలో అత్యధికంగా ఆటో కార్మికులు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని ప్రభుత్వం వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి అరుణాచలం డిమాండు చేశారు. మండలంలోని సత్యవేడు టు ఊతుకోట శ్రీ సరస్వతి ఆటో యూనియన్ స్థలంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం రమేష్ ఆధ్వర్యంలో విజయదశమి వేడకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డి అరుణాచలం మాట్లాడుతూ సత్యవేడు ఆటో యూనియన్ వాళ్లకి సత్యవేడు ప్రజలకు కార్మికులకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు సత్యవేడులో ఆటో స్టాండ్ సౌకర్యం కల్పించడంతోపాటు ఆటో యూనియన్ కు ఆఫీస్ స్థలం కేటాయించాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని వెంట నే ఆటో యూనియన్ వారికి ఆఫీస్ స్థలం కేటాయిం చాలన్నారు. సత్యవేడు మండలంలో 28 పంచాయతీలలో ఆటో కార్మికులు ప్రజలకు సేవ చేస్తున్నారని, వారికి మొత్తం 2వేల ఓట్లు ఉన్నాయి, ఈ ప్రభుత్వం ఆఫీస్ స్థలం కేటాయిం చకపోతే ఆటో కార్మికులు రాబోయే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పన్నీర్ ఉపాధ్యక్షులు అన్బు, కార్యదర్శి పలని, మోహన్ బాబు, స్టీఫెన్, ఇబ్రహీం, గిరి, మోహన్, రమేష్, వినోద్, చిన్న రాసి, ఏలుమలై, రాఖి, రూబన్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలకు అభినందనలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఈశ్వరపురం దుర్గమ్మ ఆలయంలో మూడు రోజులు పాటు సేవలు, ఆదివారం, సోమవారం మంగళవారం మూడు రోజులు పాటు పుత్తూరులోని ఈసలాపురం కొండపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో అత్యధికంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని స్కౌట్స్ అండ్ గైడ్స్ విశిష్ట సేవలు అందించారు.

సంగీతం, సాహిత్యంతో ప్రశాంతమైన జీవితం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

విశ్రాంత ఉద్యోగుల జీవనం సంగీతం, సాహిత్యంతో ముడిపడి ఉంటే ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చుని శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ పేర్కొన్నారు. పుత్తూరులోని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ తన 60వ అష్టావధానాన్ని నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భాస్కర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ అష్టావధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీ య విద్యాభవన్ తిరుపతి కేంద్ర సంచాలకులు డాక్టరు నడింపల్లి సత్యనారాయణరాజు హాజరయ్యారు. పుత్తూరు, పరిసర ప్రాంతాల్లోని సీనియర్ సిటిజన్స్ హాజరై అష్టావధానాన్ని ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. తిరుపతికి చెందిన శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ అష్టావధానానికి మరో శతావధాని ఆముదాల మురళి సంచాలకులుగా వ్యవహరించారు. పృచ్ఛకులుగా నిషిద్ధాక్షరికి ఒంటె రవి, సమస్యకు గండుపల్లి గోవిందయ్య, దత్తపదికి శోభా రాజు, న్యస్తాక్షరికి వేంకటరమణ, వర్ణనకు చంద్రశేఖర శర్మ, ఆశువుకు రంగన్న, ఛందోభాషణకు మల్లెల నాగరాజు, అప్రస్తుత ప్రసంగానికి పాలూరి బ్రహ్మానంద రెడ్డి హాజరై అవధానికి పలు ప్రశ్నలు సంధించారు. కాగా పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ తనదైన శైలిలో దీటుగా పద్యాలతో సమాధానాలను ఇచ్చి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కథారచయిత ఆర్‌సి కృష్ణస్వామిరాజు, చంద్రబాబు, హైకోర్టు అడ్వకేట్ మెరుపుల మహేశ్, విజయ్ కుమార్ పిళ్ళై , గాయకులు సోము ఉమాపతి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
భార్య పరిస్థితి విషమం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని అప్పిరెడ్డి కండ్రిగకు సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకొనింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కడపగుంట దళితవాడకుచెందిన శేఖర్(55), అతని భార్య ఉష(49) సోమవారం నెల్లేపల్లిలో కూలి పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. అప్పిరెడ్డి కండ్రిగ దగ్గరంలో ఎదురుగా వస్తున్న వాహన వెలుతురులో అదుపుతప్పి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. తీవ్ర గాయాలతో ఉన్న భార్య భర్తలను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శేఖర్ మృతి చెందాడు. పరిస్థితి విషమించడంతో ఉషను బంధువులు వేలూరుకు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

నాలు బాంబు పేలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: నాటు బాంబు పేలి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గడ్డంవారుపల్లిలో చోటు చేసుకొనింది. పోలీసులు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిరంజీవి(43) మద్యం మత్తులో నాటుబాంబు కొరికాడు. నాటుబాంబు పేలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నారు. నాటుబాంబును అడవి మృగాల కోసం ఉపయోగిస్తారని పోలీసులు అనుమానిస్తున్నారు.

అగ్నిప్రమాదంలో 11 బైక్‌లు దగ్ధం

ప్రజాశక్తి-కుప్పం: పట్టనంలోని హెచ్‌పి రోడ్డులో జరిగిన అగ్ని ప్రమాదంలో 11ద్విచక్ర వాహనాలు కాలిపోయినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ అగ్నిప్రమాదంలో మెకానిక్ షెడ్ వద్ద సంఘటన సంబవించిందని పోలీసులు తెలిపారు. రిపేరుకు ఇచ్చిన రెండు, పాత వాటితో కలిపి 11బైక్‌లు పూర్తి కాలిపోయినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాద కారణాలపై పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ కనెక్షన్

ప్రజాశక్తి - బాలాయపల్లి : తెల్ల రేషన్ కార్డులో ఉన్న వారికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తామని వైసిపి మండల అధ్యక్షులు, జయంపు సహకార సంఘం అధ్యక్షులు వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రజా సమస్యలపై ఆయన మాట్లాడుతూ ఉచితంగా గ్యాస్ పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పొందడానికి గతంలో గ్యాస్ కనెక్షన్ ఉండకూడదని, ఇక రేషన్ కార్డు తప్పని సరిగా ఉండాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కొత్తగా సపరేట్ రేషన్ కార్డు తీసుకుని గ్యాస్ కనెక్షన్ లేని వారికి ఉపయోగ పడుతుందన్నారు. ఉజ్వల యోజన గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ కనెక్షన్ తీసుకున్న వారికి, ఇకపై గ్యాస్ బుక్ చేసుకున్న ప్రతిసారి అదనపు సబ్సిడీ డబ్బులు లభిస్తాయన్నారు.

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని వికృతమాలలో టిడిపికి చెందిన మిఠాయి కార్తీక్ రాయల్ శ్రీకాళహస్తి వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు చూసి పార్టీలోకి వచ్చానని తెలిపారు. ఏర్పేడు మండలం వైసిపి ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు తెలుసు కొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తున్నారని తనకు నచ్చి ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, జడ్పిటిసి డాక్టరు కావేరి తిరుమలయ్య, మండల అధ్యక్షులు రమణ యాదవ్, ఐతేపల్లి గురునాథం, ఏర్పేడు మండలం సోషల్ మీడియా ఇన్‌చార్జి కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి, అధిక దిగుబడికి చిరు ధాన్యాలు

ప్రజాశక్తి- వెంకటగిరి రూరల్ :

ఆహారంలో భాగంగా చిరు ధాన్యాలను తీసుకోవాలని వీటి వల్ల ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం సంచాలకులు డాక్టర్ కర్ణశ్రీ అన్నారు. పెరియావరంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో చిరు ధాన్యాల క్షేత్ర ప్రదర్శనశాలకు విశిష్ట అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ రైతుల ప్రదర్శనలో సమావేశానికి అధ్యక్షులు డాక్టర్ గోవిందరాజులు ఆధ్వర్యంలో సిరి ధాన్యాల క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాలను ప్రతి రైతు పండించాలని కోరారు. అనంతరం ఏడిఏ వ్యవసాయ ఉప సంచాలకులు నాగార్జునసాగర్ మాట్లాడుతూ మెట్టు ప్రాంత రైతులు వర్ష పాతం తక్కువగా ఉన్నా చిరు ధాన్యాల పంటను వేసుకోవచ్చుని తద్వారా అధిక దిగుబడి, ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపాల్, డాక్టర్ నాగార్జున రెడ్డి, రాజీవన పాల్గొన్నారు.


క్షేత్రస్థాయి ప్రదర్శనలో పాల్గొన్న వ్యవసాయ శాఖాధికారులు